క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతు బజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 23, వంకాయ 18, బెండ 50, పచ్చి మిర్చి 40, కాకర 35, బీర 45, క్యాబేజి 10, ఫ్రెంచిబీన్స్ 35, క్యారెట్ 15, దొండ 28–35, చిక్కుడు 35, గోకర 40, బీట్‌రూట్ 15, క్యాప్సికం 40, ఆలు 17, దోస 28, సొర 13, పొట్ల 13, ఉల్లి 14, చామగడ్డ రూ. 70 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం


విరాళాన్ని అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ సమీపంలోని హుడా కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణం కోసం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా రూ. లక్ష ఆవిరాళాన్ని అందజేశారు. ఆదివారం తన నివాసంలో విరాళాన్ని అందజేశారు. అనంతరం శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ... మార్చి 6 నుంచి 8వ తేదీ వరకు శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఆలయ ప్రతినిధులు పోలా కోటేశ్వర్రావు, కట్టా రవికుమార్, కోటగిరి మహేష్, మారం వెంకట్, మునిగాల సంతోష్, ముక్కా పృథ్వీకుమార్ తదితరులు పాల్గొన్నారు.


నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: విద్యుత్ సంబంధిత మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు అరుంధతీ కాలనీ, జమాల్ కాలనీ, మొయిన్‌బాగ్, ఫతేషా నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చాదర్‌ఘాట్, చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్, తిరుమల థియేటర్, సర్దార్జీ బిల్డింగ్, కమల్‌నగర్, కట్టలగూడ, బాబుమియా దొడ్డి, న్యూలైఫ్ హాస్పిటల్, చాదర్‌ఘాట్ రోడ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామన్నారు. మధ్యాహ్నం 12 నుంచి 1:30 గంటల వరకు విజయ్‌నగర్, శంకర్‌నగర్, పద్మానగర్, హైలక్, బాడీగార్డ్ లేన్, అజంతాకాలనీ, మలక్‌పేట మటన్ మార్కెట్, అంబేడ్కర్ నగర్, పీటీసీ ఆఫీస్, అన్నపూర్ణ అపార్ట్స్, బాదంగల్లీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఎంఆర్‌ఓ ఆఫీస్, వీఎస్‌రెడ్డి నగర్, గ్యాస్ కంపెనీ, హెడ్గే నర్సింగ్‌హోం, ఆర్‌టీపీ ఆఫీస్, మూసారాం బాగ్ రోడ్, భారత్ పెట్రోల్ పంప్, వివేకానంద స్కూల్, మోర్ మార్కెట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు వివరించారు.

కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలి

లింగోజిగూడ: కుక్కల పట్ల జాగ్రత్తలు పాటించాలని, కాలనీలలో అధికంగా కుక్కలు ఉంటే ఫిర్యాదు చేయాలని వెంటనే చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ సురేందర్‌రెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కృష్ణానగర్ కాలనీలో ఆదివారం కాలనీవాసులకు, పిల్లలకు కుక్కలపై అవగాహన కల్పించారు. శానిటేషన్ డీఈ వెంకటేశం, వెటర్నరీ అధికారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కాలనీ నూతన కార్యవర్గం



హస్తినాపురం: రెడ్డికాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొండా వెంకట్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ బైరామల్‌గూడ రెడ్డికాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా కె.ఫణికుమార్, ఎస్.రంగారెడ్డి, కె.కె.మనోహర్‌రెడ్డిల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా కొండా వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుత్తా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కోమటిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జి.నర్సిరెడ్డి, కోశాధికారిగా కె.అంజిరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా కె.గోపాల్‌రెడ్డి, ఎల్.నారాయణరెడ్డిలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కాలనీ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు. అధికారుల సహకారంతో ముందుకు సాగుతామన్నారు. తమను గెలిపించిన కాలనీవాసులకు ధన్యవాదాలు తెలిపారు. నేతలు రాజిరెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకటేశ్వరగుప్తా, రమేశ్, అశోక్‌గౌడ్, మల్లయ్య పాల్గొన్నారు.

నత్తనడకన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్స్

పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా జీహెచ్‌ఎంసీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫంక్షన్ హాళ్ల నిర్మాణాలు అధికారుల నిర్లక్ష్యంతో ఆశించిన ఫలితాలను రాబట్టలేకపోతున్నాయి. అసంపూర్తిగా ఉన్న సుల్తానాఅల్వా కాలనీలోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నూతన భవన నిర్మాణం, సకల హంగులతో ముస్తాబై ఉన్నా ప్రారంభానికి నోచుకోని మరో మినీ ఫంక్షన్ హాల్స్‌పై అధికారులు శ్రద్ధ చూపడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


అసంపూర్తిగా ఉన్న సుల్తానా అల్వా మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్

- ప్రారంభానికి నోచుకోని మినీ ఫంక్షన్ హాల్
- పేదలకు తప్పని పరేషాన్
- అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం

చంపాపేట: చంపాపేట డివిజన్ సుల్తానా అల్వా కాలనీలో సుమారు 1000 గజాల ప్రభుత్వ స్థలంలో రూ. రెండు కోట్ల జీహెచ్‌ఎంసీ నిధులతో అయిదు సంవత్సరాల క్రితమే మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, గాంధీ విగ్రహ చౌరస్తాలో మరో మినీ ఫంక్షన్ హాల్ భవన నిర్మాణాలకు అప్పటి రాష్ట్ర మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. హంగు, ఆర్భాటాలతో పనులను కూడా ప్రారంభించారు. దీంతో చంపాపేట డివిజన్‌వాసుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. చిన్నపాటి బర్త్‌డే ఫంక్షన్‌లు, వివాహాలు, సభలు, సమావేశాలకు మల్టీపర్పస్, మినీ ఫంక్షన్ హాల్స్ ఉపయోగకరంగా ఉంటాయని డివిజన్‌వాసుల కలలు కల్లలే అయ్యాయి. మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌కు మంజూరైన మొత్తం నిధులు ఫంక్షన్ హాల్ రెండంతస్తుల భవనానికి గోడలు, ప్లాస్టరింగ్‌కే సరిపోయాయంటూ టాయ్‌లెట్స్, ఇంటీరియల్ నిర్మాణ పనులు వదిలివేశారు.

- చంపాపేట గాంధీ విగ్రహ చౌరస్తాలోని మినీ ఫంక్షన్ హాల్ విషయానికొస్తే అన్ని హంగులతో నిర్మాణ పనులు పూర్తయినా ప్రారంభానికి మాత్రం నోచుకోవటంలేదు. దీంతో ఆ భవనం కాస్తా అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది. ఆ ప్రాంతంలో రాత్రి వేళలో మహిళలు ఒంటరిగా ప్రయాణించాలంటే భయమేస్తుందని పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.
- సర్కిల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి వెక్కిరిస్తున్నట్లుగా ఉన్న సుల్తానాఅల్వాలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలి. నిర్మాణం పూర్తయిన గాంధీ విగ్రహ చౌరస్తాలోని మినీ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించి స్థానికులకు వినియోగంలోకి తీసుకునిరావాలని డివిజన్ వాసులు కోరుతున్నారు.


చంపాపేటలో సకల హంగులతో ముస్తాబై ప్రారంభానికి నోచుకోని మినీ ఫంక్షన్ హాల్

సత్వరమే పూర్తి చేయాలి



సుల్తానాఅల్వా కాలనీలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపడుతున్నారంటే సంబరపడ్డాం. అయిదు సంవత్సరాలు కావస్తున్నది. కొంతవరకే నిర్మాణం చేపట్టి చేతులెత్తేయటంతో మా ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. అసంపూర్తిగా ఉన్న ఫంక్షన్ హాల్ భవనం అసాంఘిక కార్యకలాపాలు, మందుబాబులకు అడ్డాగా మారింది. అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

– బైగళ్ల రాము, సుల్తానా అల్వా

పూర్తయి ఏడాదైనా...



చంపాపేట గాంధీ విగ్రహ చౌరస్తాలో మినీ ఫంక్షన్ హాల్‌లో ఫాల్స్ సీలింగ్, వివాహవేదిక టాయ్‌లెట్స్, రంగులు, టాయిలెట్స్, వాహనాల పార్కింగ్, కిచెన్, డైనింగ్ హాల్, వాల్ ఫ్యాన్ ఫిట్టింగ్స్ వంటి సౌకర్యాలతో ఫంక్షన్ హాల్ ముస్తాబైంది. ప్రారంభానికి మాత్రం నోచుకోలేదు. దీంతో ఆ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది. అధికారులు వెంటనే స్పందించి లైటింగ్, విద్యుత్ వంటి చిన్నపాటి వసతులను కల్పించి ఫంక్షన్ హాల్‌ను వినియోగంలోకి తీసుకురావాలి.

– పాశం శ్రీశైలం, చంపాపేట

కిషన్‌రెడ్డి సోదరికి దత్తాత్రేయ పరామర్శ


పరామర్శిస్తున్న గవర్నర్ దత్తాత్రేయ

సైదాబాద్: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సోదరి కుటుంబ సభ్యులను హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలో నివసించే కిషన్‌రెడ్డి సోదరి లక్ష్మమ్మ, నర్సింహారెడ్డి దంపతుల కుమారుడు జీవన్‌రెడ్డి మూడు రోజుల క్రితం గుండెపోటుతో హఠాన్మరణం చెందిన విషయం విదితమే. ఆదివారం వినయ్‌నగర్ కాలనీలోని వారి ఇంటికి చేరుకున్న బండారు దత్తాత్రేయ వారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో బీఆర్‌ఎస్ విఫలం


మాట్లాడుతున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే విషయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని, రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బ్యాంక్ కాలనీ చౌరస్తాలో బీజేపీ కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకులు అందెం రామ్‌రెడ్డి, నవకిషోర్‌రెడ్డి, శరత్‌కుమార్, విష్ణువర్ధన్, సంతోష్‌రెడ్డి, భరత్, రవికుమార్, అంజన్, వెంకటేశ్, యాదిరెడ్డి, సంజీవరెడ్డి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వినాయక బ్రహ్మోత్సవాలు


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధి హైకోర్టు కాలనీలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం సిద్ధి బుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న పూజలలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, భాస్కర్ సాగర్, ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, నాగరాజు, సత్యనారాయణ మూర్తి, ప్రసాద్‌రావు, సులోచన రాణి, అరుణ, మీనాక్షి, భారతి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే ‘ప్రజాగోస–బీజేపీ భరోసా’


మాట్లాడుతున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంగా మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమాన్ని చేపట్టామని చంపాపేట డివిజన్ కార్పొరేటర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నిర్మలానగర్ కాలనీలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జనం గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీట్ సమావేశానికి ఆయన జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వంగా మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేయటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు విష్ణువర్ధన్‌రెడ్డి, రామ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గోవర్ధన్‌చారి, అల్వాల్‌రెడ్డి, జగన్‌గుప్తా, బీజేపీ నాయకులు సద్ది సందీప్‌రెడ్డి, సుంకరి రమేష్‌గౌడ్, వీరారెడ్డి, కృపాకర్‌రెడ్డి, బూత్ స్థాయి, శక్తి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తథ్యం...

వనస్థలిపురం: బీఆర్‌ఎస్ పాలకులకు కుటుంబ పాలనపై ఉన్న దృష్టి ప్రజా సమస్యలపై లేదని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ అన్నారు. శనివారం రాత్రి హయత్‌నగర్ డివిజన్ కమలానగర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి బీజేపీ ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. బీజేపీ నాయకులు బండారి భాస్కర్, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, ఉగాది ఎల్లప్ప, రాజ్‌కిరణ్‌రెడ్డి, వెంకన్న, పార్వతి, గోవిందచారి, చంద్రపాల్, సుజాత పాల్గొన్నారు.


ఆర్‌కే పురంను ఆదర్శంగా తీర్చిదిద్దుతా: రాధా ధీరజ్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: అభివృద్ధిలో రామకృష్ణాపురం డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కార్పొరేటర్ రాధ ధీరజ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మార్గదర్శికాలనీ, వాసవీకాలనీ తదితర కాలనీలలో పర్యటించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... జీహెచ్‌ఎంసీ పరిధిలోనే రామకృష్ణాపురాన్ని అన్ని విధాలా తీర్చిదిద్ది అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేత రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

వనస్థలిపురం: యశోద ఆస్పత్రి సోమాజిగూడ ఆధ్వర్యంలో ఆదివారం వనస్థలిపురంలోని శ్రీ కృష్ణ ఎండో అండ్ డయాబెటిక్ సెంటర్ ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన వారికి కార్డియాలజీ, 2డి ఇకో, ఈసీజీ తదితర పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మంది వరకు వైద్య సేవలు పొందారు. యశోద ఆస్పత్రి కార్డియాలజీ ఎండీ, డీఎం డాక్టర్ జగదీష్ మాదిరెడ్డి, శ్రీ కృష్ణా ఎండో, డయాబెటిక్ సెంటర్ ఎండీ, డీఎం డాక్టర్ జె.నాగేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే బీజేపీ లక్ష్యం: నల్లు


మాట్లాడుతున్న నల్లు ఇంద్రసేనారెడ్డి

మలక్‌పేట: పేదల అభివృద్ధి... సంక్షేమం.. అభ్యున్నతే లక్ష్యంగా బీజేపీ చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని ఆ పార్టీ జాతీయ నాయకుడు నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రెడ్డితో కలిసి శనివారం రాత్రి సలీంనగర్‌లో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు నల్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. మలక్‌పేటలో బీజేపీ జెండా ఎగురవేసే దిశగా కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జి రమేష్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో జరిగిన మీటింగ్‌లో నాయకులు దేవేందర్, యాదగిరిరెడ్డి, వై.సురేందర్, కొప్పుల దినేష్, జక్కా మోహన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, శశికాంత్, లక్ష్మారెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలను కించపరచడం సరికాదు


కోట్ల శ్రీనివాస్‌ను సన్మానించిన దృశ్యం

సైదాబాద్: హిందూ భక్తుల మనోభావాలు కించపరిచేలా బాబా ఆలయంలో అన్య మత ప్రార్థనలు నిర్వహించడం సరికాదని టీ పీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాల్లో పాల్గొన్నారు. బాబాను దర్శించుకున్న ఆయనను ఆలయ కమిటీ ప్రతినిధులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాబా ఆలయంలో చోటుచేసుకున్న దురదృష్టకర సంఘటనకు బాధ్యులైన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనపై భక్తులు కలత చెందకుండా శాంతియుతంగా ఉండాలని ఆయన సూచించారు. ఆలయ కమిటీ ప్రతినిధి నేరెళ్ల ప్రసాదరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


ప్రదర్శనను తిలకిస్తున్న వైస్ చైర్మన్...

మన్సూరాబాద్: సెంట్రల్‌బ్యాంక్‌కాలనీలోని కాకతీయ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. రెండు రోజుల ఈ ప్రదర్శలో 3, 4 సంవత్సరాల బాలబాలికల నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొని ఎలక్ట్రానిక్ సైకిల్, నెంబర్‌హౌస్, రోబో తదితర ప్రాజెక్టులు ప్రదర్శించి తమ ప్రతిభను చాటారు. ఆదివారం ముగింపు కార్యక్రమానికి హాజరైన కాకతీయ విద్యాసంస్థల వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లు రవిప్రసాద్, శర్మ విద్యార్థులను అభినందించారు. పాఠశాల అడ్మిన్ రాధ, ప్రిన్సిపాల్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని మంత్రికి వినతి

హస్తినాపురం: పేదలు ఎక్కువగా నివసించే నందనవనం కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని హస్తినాపురం మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మానాయక్ కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని విద్యా శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని ఆదివారం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ... పేదప్రజలు ఎక్కువగా ఉన్న నందనవనం, భూపేశ్‌గుప్తానగర్‌కాలనీ, దేవీనగర్, ఇంద్రసేనారెడ్డినగర్‌లలో చదువుకుంటున్న వారి కోసం వచ్చే సంవత్సరం నుంచి ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌నాయక్, నల్ల నాగిరెడ్డి, భిక్షపతి చారి పాల్గొన్నారు.

పేదలకు అందని వైద్యం: కార్పొరేటర్ జీవన్‌రెడ్డి


వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: శాస్త్ర సాంకేతిక రంగంలో ఎంతో అభివృద్ధి సాధిస్తున్నా రాష్ట్రంలో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదని, అందరికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను తీసుకొచ్చినా రాష్ట్ర ప్రభుత్వం వాటిని పేదలకు అందించడం లేదని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్‌లోని రాఘవేంద్రాకాలనీలో కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో నిజాం నిరంకుశ పాలన సాగుతోందని, బీఆర్‌ఎస్ పాలనలో మారుమూల ప్రాంత ప్రజలకు వైద్యం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీ నాయకులు నర్సయ్య, చిన్న, కోట రవీదర్, సంఘి అశోక్, ఏళ్లరెడ్డి, బాల్‌రెడ్డి, హరినాథ్‌బాబు, మహేష్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, కిషన్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మన్సూరాబాద్: మన్సూరాబాద్ గ్రామానికి చెందిన సుంకరి వెంకటేష్ అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. చికిత్స ఖర్చులు భరించలేని ఆయన బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డిని ఆశ్రయించాడు. ఆయన ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సీఎం సహాయ నిధి నుంచి రూ. 60 వేలు మంజూరు చేయించారు. అందుకు సంబంధించిన చెక్కును ఆదివారం జక్కిడి మల్లారెడ్డి బాధితుడు వెంకటేష్‌కు అందజేశారు.

నల్లపోచమ్మకు ప్రత్యేక పూజలు

మన్సూరాబాద్: డివిజన్ హయత్‌నగర్ పరిధి బాలాజీనగర్‌కాలనీలోని నల్లపోచమ్మ ఆలయ నూతన కమిటీ సన్మాన కార్యక్రమం ఆదివారం ఆలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, హనుమంత్‌రెడ్డి, కాలనీ నేతలు మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కొండారెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, శివప్రసాద్, లక్ష్మారెడ్డి, సురేష్, శ్రావణ్, కల్పనాదేవి, మాధవి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలి


సంతకాలను సేకరిస్తున్న బీఎస్పీ నాయకులు

లింగోజిగూడ: జనాభా ప్రతిపాదికన బీసీలకు 52 శాతం రిజర్వేషన్లను కల్పించాలని బీఎస్పీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి.వై.గిరిమహారాజ్, బీవీఎఫ్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ చీటురి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బీఎస్పీ ఎల్‌బీనగర్ కార్యదర్శి కట్లకుమార్, లింగోజిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి కంసాలి నరేష్ ఆధ్వర్యంలో లింగోజిగూడ చౌరస్తాలో కోటి సంతకాలను సేకరించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గిరి, రాజ్‌కుమార్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు అన్యాయం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో రానున్నది బహుజనుల రాజ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు దాసరి వినయ్ అశోక్‌యాదవ్, రాజ్‌కుమార్, వేముగంటి సంపత్, జక్క యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అష్టోత్తర శత గళార్చన


గళార్చన నిర్వహిస్తున్న దృశ్యం

నాగోలు: భక్తి విధానాల్లో కీర్తన అద్భుతమైన ప్రక్రియ అని తెలంగాణ అధికార భాషా సంఘం అధ్యక్షులు మంత్రి శ్రీదేవి అన్నారు. ఆదివారం స్నేహపురి శ్రీ గోదా సమేత పద్మావతీవెంకటేశ్వర స్వామి ఆలయంలో వివిధ సంస్కృతిక సంస్థలు, ఆలయ కమిటీ సంయుక్తంగా అష్టోత్తర శత గళార్చన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి శ్రీదేవి మాట్లాడుతూ... తెలుగు భాష.. సంస్కృతికి అద్దం పట్టే పలు అంశాలను ప్రస్తావించారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించే ప్రతి ఒక్కరూ భాషను పటిష్ఠం చేసేవారవుతాన్నారు. అన్నమయ్య, రామదాసు, త్యాగయ్య, క్షేత్రయ్య, ముత్తుస్వామి దీక్షతుల కీర్తనలు స్వామి వారి మణిహారాలుగా వీరాజిలుతున్నాయని గుర్తు చేశారు. తెలంగాణ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న పల్లె కన్నీరు పెడుతోందని కవితను గుర్తు చేశారు. అఖిల భారతీయ భాషా సమ్మేళన్ అధ్యక్షుడు ఆచార్య కడారి సత్యమూర్తి మాట్లాడుతూ... పిల్లలకు భాషా సంస్కృతిని అలవాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీటీడీ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ హరినాథ్, సంస్కృతి, ధార్మిక ఉపన్యాసకులు వద్దిరాజు జనార్దన్‌రావు, విశ్వసాహితి అధ్యక్షుడు జయరాములు, నిర్వాహకులు గోళ్ల మూడి పద్మావతి, శారదాసాగిరి, ప్రత్యూష, హరి బృందం సహా 108 మందికిపైగా రాగయుక్తంగా కీర్తనలు పాడి అందరినీ అలరించారు. ఆలయ కమిటీ చైర్మన్ వారణాశి వంశీ, కార్యదర్శి ప్రసన్న కృష్ణ, కోశాధికారి హేమసుందర్‌రావు, మేనేజర్ రవి తదితరులు పాల్గొన్నారు.